నమస్తే తెలంగాణ
భద్రాద్రి కొత్తగూడెం
5 | ఖమ్మం, ఆదివారం 19 మే 2024 | BHADRADRI KOTHAGUDEM


# పల్లె పాలనకు కష్టాలు



చుంచుపల్లి మండలం రాంపురం జీపీలో మూలనపడిన ట్రాక్టర్

- గత కేసీఆర్ ప్రభుత్వంలో కాంతులీనిన గ్రామ సీమలు
- నేటి కాంగ్రెస్ పాలనలో కారు చీకట్లలోకి పంచాయతీలు
- మూడు నెలలుగా పంచాయతీ వర్కర్లకు వేతనాలు లేవు
- 'ఖమ్మం'లో 140 ట్రాక్టర్ల ఈఎంఐల చెల్లింపులకు ఇక్కట్లు
- మూడు నెలలుగా కరెంట్ బకాయిలకు కటకట
- పంచాయతీల పాలనకు నిండుకున్న నిధులు
- ప్రత్యేకాధికారుల పాలనలో గ్రామాల్లో అభివృద్ధికి బీటలు




## 'భద్రాద్రి' పల్లెల్లోనూ నీరసం

భద్రాద్రి కొత్తగూడెం, మే 18 (నమస్తే తెలంగాణ) : భద్రాద్రి జిల్లాలో కేసీఆర్ సర్కారులో ఒక వెలుగు వెలిగిన పల్లెలు.. ప్రస్తుత కాంగ్రెస్ సర్కారులో నిధులులేక నీరసించాయి. డీజిల్ లేకపోవడంతో పంచాయతీల ట్రాక్టర్లు నడవలేకపోతున్నాయి. తప్పని సరి అయితేనే కార్యదర్శులు డీజిల్ పోయిస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి రావాల్సిన నిధులు రాకపోవడంతో నాలుగు నెలలుగా సిబ్బందికి వేతనాలు కూడా ఇవ్వలేని పరిస్థితి. భద్రాద్రి జిల్లాలో 481 గ్రామ పంచాయతీలుండగా వాటిల్లో మేజర్ పంచాయతీలు మాత్రమే ఇంటిపన్నుల ఆదాయాన్ని కొంతమేరకు అభివృద్ధి పనులకు వినియోగిస్తున్నాయి. చిన్న పంచాయతీల కార్యదర్శులు జేబులు ఖాళీ చేసుకోవాల్సిన పరిస్థితి.

ఖమ్మం, మే 18 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : 'పల్లెల ప్రగతే దేశానికి పట్టుకొమ్మ' అన్నారు పెద్దలు. కానీ అవే పల్లెలకు నేడు కష్టాలు ప్రారంభమయ్యాయి. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ సారథ్యంలో నూతన పంచాయతీరాజ్ చట్టాన్ని రూపొందించారు. పంచాయతీల పాలనను బలోపేతం చేయడంతో పాటు వాటిని ప్రగతిపథంలో ముందుకు నడిపించారు. పదేళ్ల కేసీఆర్ పాలనలో పల్లెసీమల్లో అభివృద్ధి పరుగులు పెట్టింది. కానీ ఐదు నెలల క్రితం కాంగ్రెస్ పాలన వచ్చిందోలేదో పల్లెలకు కష్టాలు తోడయ్యాయి. అప్పటి నుంచి ఇప్పటి వరకూ పల్లెల అభివృద్ధిని పట్టించుకునే వారే కరువయ్యారు. ఫలితంగా అప్పటి వరకూ కాంతులీనిన పల్లె సీమలను కారు చీకట్లు చుట్టుముట్టాయి. పాలన అంతా 'ఎక్కడ వేసిన గొంగళి అక్కడే' అన్నట్లుగా ఉంది.

### నాడు నిరంతర పరిశ్రమ..

గ్రామాల అభివృద్ధికి నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ నిరంతరం పరిశ్రమించారు. దీంతో గ్రామాల్లో అభివృద్ధి పనులు నిత్యం కొనసాగాయి. నిధులు ప్రతి నెలా మంజూరయ్యేవి. దీంతో వీధిలైట్లు, వైకుంఠధామాలు, పల్లె ప్రకృతి వనాలు, డంపింగ్ యార్డులు, తాగునీరు, సీసీ రోడ్లు, మురుగు కాలువల నిర్వహణ క్రమం తప్పకుండా జరిగేది. మల్టీ పర్పస్ వర్కర్లను నియమించి గ్రామాల్లో పరిశుభ్రతకు పాటుపడ్డారు. ప్రతి గ్రామ పంచాయతీకీ ఒక ట్రాక్టర్, ట్రాలీ, నీటి ట్యాంకర్‌ను అందించారు. ఆ ట్రాక్టర్‌తో గ్రామంలో చెత్తను సేకరించి డంపింగ్ యార్డులకు తరలించేవారు. ట్యాంకర్ ద్వారా హరితహారం మొక్కలకు, నర్సరీల్లోని మొక్కలను నీటిని అందించేవారు. దోమలను పారదోలేందుకు ప్రతి గ్రామంలోనూ ఫాగింగ్ మెషీన్లను అందించారు.

### నేడు తిరోగమనం..

కాంగ్రెస్ పాలన వచ్చిన నాటి నుంచి పల్లె సీమలన్నీ తిరోగమనంవైపు పయనిస్తున్నాయి. అభివృద్ధి జాడలు మచ్చుకైనా కన్పించడంలేదు. పారిశుధ్యం పూర్తిగా అటకెక్కింది. గాలిదుమారాలకు దెబ్బతిన్న వీధిలైట్లు, ఎల్ఈడీ బల్బుల స్థానంలో కొత్తవి అమర్చేందుకు కూడా కనీసం నిధులు లేవు. పంచాయతీల్లోని కంప్యూటర్ ఆపరేటర్లకు 3 నెలలుగా వేతనాలు లేవు. మల్టీపర్పస్, పారిశుధ్య వర్కర్లదీ అదే పరిస్థితి. ఖమ్మం జిల్లాలోని 20 మండలాల్లో 589 గ్రామ పంచాయతీలున్నాయి. అన్ని పంచాయతీలు ట్రాక్టర్లు కొనుగోలు చేసినప్పటికీ వాటిలో 140 ట్రాక్టర్లను ఈఎంఐ ద్వారా కొనుగోలు చేశారు. వాటికి ప్రస్తుతం నిధుల కొరత ఏర్పడడంతో రెండు నెలలుగా ఈఎంఐలు చెల్లించే పరిస్థితులు లేవు. పంచాయతీల్లో ఉన్న తాగునీటి బోర్లు, వీధి దీపాల విద్యుత్‌కు బిల్లుల చెల్లింపులకు మూడు నెలలుగా కటకటలాడుతున్న పరిస్థితి. చివరికి ట్రాక్టర్ల డీజిల్ కోసం కూడా దిక్కులు చూడాల్సిన దుస్థితి. కాంగ్రెస్ పాలనలో పల్లెల దయనీయ స్థితికి ఇలాంటివి ఎన్నో ఉదాహరణలు.

### నాలుగైదు గ్రామాలకు ఒక ప్రత్యేకాధికారి..

గ్రామ పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించకపోవడంతో నాలుగు నెలలుగా అవి ప్రత్యేక అధికారుల పాలనలో నడుస్తున్నాయి. గ్రామాలకు మండల స్థాయి అధికారులను ప్రత్యేక అధికారులుగా నియమించినప్పటికీ.. ఒక్కో అధికారి సగటున నాలుగైదు గ్రామాల బాధ్యతలను పర్యవేక్షించాల్సి వస్తోంది. దీంతో వారు ఆయా పంచాయతీలపై పూర్తి స్థాయిలో దృష్టి సారించే అవకాశం లేకపోయింది. దీంతో ప్రత్యేకాధికారుల పాలనా విధానం విఫలమైంది. కానీ గత కేసీఆర్ ప్రభుత్వం పంచాయతీల పాలనను బలోపేతం చేసి ప్రజలకు నాణ్యమైన సేవలు అందించేందుకు అన్ని గ్రామ పంచాయతీలకూ గ్రామ కార్యదర్శులను నియమించింది. ప్రస్తుతం వారు విధుల్లో ఉన్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం నుంచి నిధులు రాకపోవడంతో వారు ఏమీ చేయలేని పరిస్థితి. రానున్న వానకాలంలో గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలుతాయి. ఇందుకోసం పల్లెల్లో నిత్యం పారిశుధ్య పనులు చేపట్టాలి. కానీ రాష్ట్ర ప్రభుత్వ తీరుతో మున్ముందు ఏం జరుగుతుందో చూడాలి.

### బిల్లులు పెండింగ్ ఉన్న మాట వాస్తవమే..



గ్రామ పంచాయతీలకు బిల్లులు పెండింగ్‌లో ఉన్న మాట వాస్తవమే. రెండు నెలలుగా పారిశుధ్య కార్మికులకు, మూడు నెలలుగా 70 మంది కంప్యూటర్ ఆపరేటర్లకు వేతనాలు అందడం లేదు. కరెంట్ బిల్లుల చెల్లింపులు కూడా పెండింగ్‌లోనే ఉన్నాయి. నిధులు విడుదలైన వెంటనే బకాయిలు చెల్లిస్తాం. నిధుల కోసం ఉన్నతాధికారులకు నివేదిక పంపించాం. **–హరికిషన్, డీపీవో, ఖమ్మం**

### చిన్న చిన్న సమస్యలుంటే పరిష్కరిస్తున్నాం..



పంచాయతీల్లో కార్మికులకు వేతనాలు ఇస్తున్నాం. నిధులు రావడం.. రాకపోవడం అనేది సమస్య కాదు. రాంపురంలో ట్రాక్టర్ మూలనపడిన విషయం నా దృష్టికి రాలేదు. డీజిల్ సమస్య కారణంగా ట్రాక్టర్లు తిరగడం లేదనే ఇబ్బందులు ఎక్కడా లేవు. చిన్న చిన్న సమస్యలుంటే పరిష్కరిస్తున్నాం.

**–చంద్రమౌళి, డీపీవో, భద్రాద్రి కొత్తగూడెం**

# ఈవీఎంలకు పటిష్ట భద్రత

**ఖమ్మం ఆర్వో, కలెక్టర్ వీపీ గౌతమ్**



అధికారులకు దిశానిర్దేశం చేస్తున్న కలెక్టర్ వీపీ గౌతమ్

ఖమ్మం రూరల్, మే 18 : లెక్కింపు కేంద్రంలోకి చేర్చిన ఈవీఎంల భద్రతకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ వీపీ గౌతమ్ తెలిపారు. శనివారం మండలంలోని శ్రీచైతన్య ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఈవీఎం స్ట్రాంగ్‌రూంలను కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఈవీఎంల భద్రతకు అన్ని రకాల చర్యలు చేపట్టాలన్నారు. ఖాళీగా ఉన్న వెంటిలేటర్ కిటికీలను ఇటుకలతో మూసివేయాలని, వర్షపు జల్లులు లోనికి రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం స్ట్రాంగ్‌రూంల భవనంపైకెక్కి పరిశీలించిన కలెక్టర్ వర్షపు నీరు నిలవకుండా చూడాలన్నారు. ఎల్ఈడీ స్క్రీన్‌పై ఏడు సెగ్మెంట్లు, పోస్టల్ బ్యాలెట్ల స్ట్రాంగ్ రూంల వ్యూను పరిశీలించారు. భద్రతా సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఆర్అండ్‌బీ ఎస్ఈ శ్యాంప్రసాద్, మైనార్టీ సంక్షేమ అధికారి మహ్మూది, ఆర్అండ్‌బీ ఏఈఈ విశ్వనాథ్, తహసీల్దార్ పిల్లి రాంప్రసాద్, ఎంపీవో రాజారావు తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీగా రాకేశ్‌రెడ్డికే పట్టం కట్టాలి

**బీఆర్ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్**



సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు తాతా మధుసూదన్

సత్తుపల్లి టౌన్, మే 18 : ఖమ్మం–నల్లగొండ–వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలో బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి పట్టం కట్టాలని బీఆర్ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ కోరారు. శనివారం సత్తుపల్లిలో నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాకేశ్‌రెడ్డిని గెలిపించడానికి గ్రామాల్లో బీఆర్ఎస్ కమిటీలు ఏర్పాటు చేసుకొని విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. శాసనమండలిలో పట్టభద్రుల ఆత్మగౌరవాన్ని పెంచే విధంగా.. ప్రశ్నించే తత్వం గల వ్యక్తిగా సామర్థ్యం ఉన్న రాకేశ్‌రెడ్డి గెలుపు కోసం ప్రతి ఒక్కరూ పని చేయాలన్నారు. తొలుత డీసీఎంఎస్ మాజీ చైర్మన్ రాయల వెంకట శేషగిరిరావు మృతి పట్ల రెండు నిమిషాలు మౌనం పాటించి సంతాపం తెలిపారు. సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కొత్తూరు ఉమామహేశ్వరరావు, ఖలీల్, జడ్పీటీసీ కూసంపూడి రామారావు, బీఆర్ఎస్ పట్టణ, మండల అధ్యక్షులు రఫీ, యాగంటి శ్రీనివాసరావు, సంజీవరెడ్డి, మాధురి మధు తదితరులు పాల్గొన్నారు.

# లోక్ అదాలత్‌లో సత్వర న్యాయం

**జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ పాటిల్ వసంత్**




మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్

కొత్తగూడెం టౌన్, మే 18 : లోక్ అదాలత్‌లో బాధితులకు సత్వర న్యాయం జరుగుతుందని, జిల్లా కోర్టులో జూన్ 8న జరిగే జాతీయ లోక్ అదాలత్‌లో కేసులు ఎక్కువగా పరిష్కారం అయ్యేందుకు కృషి చేయాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్ అన్నారు. శనివారం జిల్లా కోర్టు కాన్ఫరెన్స్ హాల్‌లో పోలీసు అధికారులు, బీమా కంపెనీ న్యాయవాదులతో జరిగిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. బీమా కంపెనీల ప్రతినిధులు తమ కేసులను వీలైనంత త్వరగా పరిష్కరించుకోవాలన్నారు. వాహన ప్రమాద బాధితుల కేసులలో కక్షిదారులకు న్యాయం జరగాలని సూచించారు. లోక్ అదాలత్‌లలో రాజీపడడం వల్ల కక్షిదారులకు సమయం, డబ్బు వృథా కాదన్నారు. అలాగే పోలీస్‌స్టేషన్ల వారీగా పెండింగ్‌లో ఉన్న క్రిమినల్ కాంపౌండ్ కేసులు, డ్రంక్ అండ్ డ్రైవ్, ఈ పెట్టి చలాన్ కేసులను సత్వరమే పరిష్కరించాలని పోలీసు అధికారులను ఆదేశించారు. క్రిమినల్, సివిల్, మనోవర్తి, వాహన ప్రమాద, బ్యాంకు కేసులను పరిష్కరించుకునేందుకు కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమావేశంలో న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి భానుమతి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి రామారావు, మూడో అదనపు జూనియర్ సివిల్ జడ్జి శివనాయక్, కొత్తగూడెం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్కినేని సత్యనారాయణ, డీఎస్పీ అబ్దుల్ రెహమాన్, పీపీలు పోసాని రాధాకృష్ణమూర్తి, నాగిరెడ్డి, ఎక్సైజ్ అధికారులు, స్టేషన్ హౌస్ ఆఫీసర్లు, ఇన్సూరెన్స్ కంపెనీకి సంబంధించి సీనియర్ న్యాయవాదులు కొత్తపల్లి రామారావు, బండారుపల్లి గంగాధర్, అంబటి రమేశ్, ఏవో మోహన్‌దాస్ పాల్గొన్నారు.

# బాయిల్డ్ రైస్‌మిల్ కోసం స్థల సేకరణ చేయాలి

**భద్రాద్రి జెడ్పీ సర్వసభ్య సమావేశంలో చైర్మన్ కంచర్ల**




మాట్లాడుతున్న భద్రాద్రి జడ్పీ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్‌రావు

భద్రాద్రి కొత్తగూడెం, మే 18 (నమస్తే తెలంగాణ) : జిల్లావ్యాప్తంగా ధాన్యం దిగుబడి ఎక్కువగా వస్తున్నందున కొత్తగూడెం ప్రాంతంలో బాయిల్డ్ రైస్‌మిల్ నిర్మాణానికి స్థల సేకరణ చేపట్టాలని జడ్పీ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్‌రావు అన్నారు. శనివారం స్థానిక జడ్పీ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. గ్రామీణ మంచినీటి పథకం, ఇంట్రా, పారిశుధ్య, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, జిల్లా సమన్వయ, ఉపాధిహామీ పథకం, విద్య, వ్యవసాయ శాఖలు చేపట్టే అంశాలపై సమీక్షించారు. గత సమావేశంలో చర్చించిన సమస్యలు కొన్ని పరిష్కారమయ్యాయని, డబుల్ బెడ్‌రూం ఇళ్లు కొన్నిచోట్ల ప్రారంభానికి నోచుకోలేదని, దీనిపై ఎమ్మెల్యే దృష్టి సారించాలని కోరారు. విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే ఖాళీగా ఉన్న ఎంఈవో పోస్టుల భర్తీపై శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఎండల తీవ్రత దృష్ట్యా తాగునీటి కొరత లేకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో జడ్పీ సీఈవో ప్రసూనరాణి, ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, జడ్పీటీసీలు, కో ఆప్షన్ మెంబర్లు పాల్గొన్నారు.

# గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షకు.. పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

- ఎక్కడా ఎలాంటి తప్పిదాలకూ తావులేకుండా చర్యలు చేపట్టాలి
- కలెక్టర్ల వీడియో కాన్ఫరెన్స్‌లో టీజీపీఎస్సీ చైర్మన్ మహేందర్‌రెడ్డి
- సిద్ధంగా ఉన్నాం: ఖమ్మం, భద్రాద్రి కలెక్టర్లు గౌతమ్, ప్రియాంక



వీసీలో పాల్గొన్న ఖమ్మం కలెక్టర్ వీపీ గౌతమ్

మామిళ్లగూడెం/కొత్తగూడెం టౌన్, మే 18 : వచ్చే నెల 9న జరిగే గ్రూప్–1 ప్రిలిమినరీ పరీక్ష నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్(టీజీపీఎస్సీ) చైర్మన్ ఎం.మహేందర్‌రెడ్డి జిల్లాల కలెక్టర్లు, పోలీసు అధికారులకు సూచించారు. గ్రూప్–1 ప్రిలిమినరీ పరీక్షలకు చేపడుతున్న ఏర్పాట్లపై జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, సీపీలతో హైదరాబాద్ నుంచి శనివారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రశాంత వాతావరణంలో పారదర్శకంగా పరీక్ష నిర్వహణకు అన్ని చర్యలూ తీసుకోవాలని ఆదేశించారు. పరీక్షల నిర్వహణ కోసం ప్రతి జిల్లాకూ ఒక రీజినల్ కోఆర్డినేటర్‌ను నియమించామని, అదనపు కలెక్టర్, రీజినల్ కోఆర్డినేటర్లు జాయింట్ కస్టోడియన్‌గా ఉంటారని, వీరికి పోలీసు నోడల్ అధికారి సహకరిస్తారని అన్నారు. విద్యార్థులకు బయోమెట్రిక్ నిర్వహణ ఉంటుందని అన్నారు. బయోమెట్రిక్ తీసుకునే విధానంపై సిబ్బందికి శిక్షణ ఇవ్వాలని సూచించారు. రీజినల్ కోఆర్డినేటర్లు, సెంటర్ అబ్జర్వర్లు, డిపార్టుమెంట్ ఆఫీసర్లు, పోలీస్ నోడల్ అధికారులకు ఈ నెల 22న హైదరాబాద్‌లో శిక్షణ ఇస్తామన్నారు.

**కేంద్రాలను సిద్ధం చేశాం : ఖమ్మం కలెక్టర్**

ఖమ్మం కలెక్టర్ వీపీ గౌతమ్ మాట్లాడుతూ.. జిల్లాలో 18,600 మంది అభ్యర్థుల కోసం 52 పరీక్షా కేంద్రాలను సిద్ధం చేసినట్లు తెలిపారు. సీసీ కెమెరాల ఏర్పాటుతోపాటు పరీక్ష సజావుగా నిర్వహించేందుకు లైజన్ అధికారులు, చీఫ్ సూపరింటెండెంట్లను ఏర్పాటు చేశామని అన్నారు. అదనపు కలెక్టర్లు సత్యప్రసాద్, మధుసూదన్‌నాయక్, జిల్లా అధికారులు మాలతి, అఫ్రిన్ సిద్ధిఖీ, సోమశేఖర శర్మ, జాన్‌బాబు, రాజ్‌కుమార్, బాబూరావు, శ్రీనివాస్, అరుణ తదితరులు పాల్గొన్నారు.

**భద్రాద్రి జిల్లాలో 21 కేంద్రాలు : కలెక్టర్ ప్రియాంక**

భద్రాద్రి కలెక్టర్ ప్రియాంక మాట్లాడుతూ.. జిల్లాలో గ్రూప్–1 ప్రిలిమినరీ పరీక్షకు 8,875 మంది అభ్యర్థుల కోసం 21 కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల్లో అభ్యర్థులకు ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లూ చేస్తున్నట్లు చెప్పారు. అభ్యర్థులను ప్రధాన గేటు ద్వారా మాత్రమే పరీక్షా కేంద్రాల్లోకి పంపిస్తామన్నారు. అనంతరం టీజీపీఎస్సీ రీజినల్ కో ఆర్డినేటర్ డాక్టర్ జగన్మోహన్‌రాజు, కలెక్టర్ ప్రియాంక కలిసి ఐడీవోసీలోని స్ట్రాంగ్‌రూమ్‌ను పరిశీలించారు. డీఎస్పీ రెహమాన్, జిల్లా పరిపాలనాధికారి గన్యా పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు

**భద్రాద్రి జిల్లా ఆర్వో, కలెక్టర్ ప్రియాంక ఆల**




సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రియాంక ఆల

భద్రాద్రి కొత్తగూడెం, మే 18 (నమస్తే తెలంగాణ) : వరంగల్–ఖమ్మం–నల్లగొండ శాసనమండలి పట్టభద్రుల ఉప ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని భద్రాద్రి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రియాంక ఆల ఆదేశించారు. శనివారం ఐడీవోసీ సమావేశ మందిరంలో ఏఆర్వోలు, నోడల్ ఆఫీసర్లు, తహసీల్దార్లతో పోలింగ్ అధికారుల నియామకం, ఏర్పాట్లపై కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉప ఎన్నిక పోలింగ్ ఈ నెల 27న, కౌంటింగ్ జూన్ 5న ఉన్నట్లు చెప్పారు. జిల్లాలో ఎన్నికల నిర్వహణకు 55 పోలింగ్ కేంద్రాలు, 76 మంది పీవోలు, 76 మంది ఏపీవోలు, 160 మంది వోపీవోలు అవసరం ఉన్నట్లు చెప్పారు. ఆ దశగా ఏర్పాట్లు చేయడంతోపాటు పోలింగ్ విధులకు సిబ్బందిని కేటాయించాలన్నారు. పోలింగ్ సిబ్బందికి శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాట్లు చేయాలని, ఎక్కడా తప్పిదాలకు ఆస్కారం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. 5 ఫ్లయింగ్ స్క్వాడ్, 5 ఎంసీసీ బృందాలను ఏర్పాటు చేసి నిఘా పకడ్బందీగా చేపట్టాలన్నారు. జిల్లాలో 40,106 మంది పట్టభద్రుల ఓటర్లు నమోదు కాగా.. ఇందులో 22,590 మంది పురుషులు, 17,516 మంది మహిళలు ఉన్నారన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కాశయ్య, ఆర్డీవోలు మధు, దామోదర్‌రావు, ఎన్నికల సూపరింటెండెంట్ దార ప్రసాద్, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ రంగా ప్రసాద్, నోడల్ ఆఫీసర్లు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

# ఖమ్మం జిల్లాలో మోస్తరు వర్షం

ఖమ్మం రూరల్/కూసుమంచి, మే 18 : భూ ఉపరితల ద్రోణి ప్రభావంతో శనివారం జిల్లాలోని పలు మండలాల్లో చిరు జల్లులతో ప్రారంభమై మోస్తరు వర్షం కురిసింది. మేఘాలు కమ్ముకొని వాతావరణంలో ఒక్కసారిగా మార్పు చోటు చేసుకోవడం.. వర్షం కురవడంతో నిన్న మొన్నటి వరకు ఎండ వేడితో అతలాకుతలమైన ప్రజలు చల్లదనంతో సేద తీరుతున్నారు. తెల్లవారుజాము నుంచి ఖమ్మం అర్బన్, రూరల్ మండలంతోపాటు ముదిగొండ, కూసుమంచి మండలాల్లో దట్టమైన మేఘాలు కమ్ముకొని వర్షం కురిసింది. దీంతో పలు పనుల నిమిత్తం బయటకు వెళ్లే ప్రజలు ఇబ్బందులు పడ్డారు. మధ్యాహ్నం వేళ జిల్లాలోని ఇతర మండలాల్లో సైతం అక్కడక్కడా చిరుజల్లులతో కూడిన వర్షం కురిసింది. ఖమ్మం రూరల్ మండలంలో 15 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా.. కల్లూరు 12.3 మి.మీ, ఖమ్మం అర్బన్ 8.8, బోనకల్ 6.5, ముదిగొండ 5.5, మధిర, తల్లాడ మండలాల్లో 3 మిల్లీమీటర్ల చొప్పున వర్షపాతం నమోదైంది. ద్రోణి ప్రభావంతో రాబోయే నాలుగు రోజులపాటు జిల్లాలో విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని ఇప్పటికే వాతావరణ శాఖ అధికారులు ప్రకటించారు.



వర్షంలోనే గొడుగు సహాయంతో విధులకు వెళ్తున్న మహిళ



కూసుమంచిలో వర్షంలో పశువులను తోలుకెళ్తున్న యజమానులు


